ముగిసిన కోటి కుంకుమార్చన

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో జరుగుతున్న కోటి కుంకుమార్చన పూజలు బుధవారం ముగిశాయి. ఈ నెల 8న ఈ పూజలు ప్రారంభం కాగా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కామేశ్వర్, రామేశ్వర్, మాజీ ధర్మకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

చిలకలగూడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్ సూచించారు. సికింద్రాబాద్ శ్రీనివాసనగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయనతోపాటు మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్(ఎంఎస్‌ఎంఈ) సీనియర్ మేనేజర్ రాజ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈ ద్వారా కులవృత్తుల వారికి ఎటువంటి రూ 5 నుంచి 40 లక్షల వరకు రుణాలు అందిస్తుందన్నారు. ముందుగా ఎంఎస్‌ఎంఈలో సభ్యత్వం తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాళ్లబండి విష్ణుచారి, ప్రతినిధులు బైరోజు రవీందర్‌చారి, భిక్షపతిచారి

ఉమెన్స్‌డే వేడుకలు విజయవంతం చేయాలి

లాలాపేట: నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఎన్‌సీసీ) ఆధ్వర్యంలో మార్చి 8న ఉమెన్స్‌డే సందర్భంగా నిర్వహించే వేడుకలను విజయవంతం చేయాలనీ ఎన్‌సీసీ తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షులు ప్రసన్న బోల్డ్ పిలుపునిచ్చారు. బుధవారం బెరేకా ఫ్యామిలీ వర్షిప్ సెంటర్‌లో ఎన్‌సీసీ తెలంగాణ రాష్ట్ర ప్రసిడెంట్ బిషప్ సంజయ్ ఆనంద్, జనరల్ సెక్రటరీ బక్క ఏలియా, మహిళా ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళా ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం


సాయికిరణ్ (ఫైల్)

అడ్డగుట్ట: పనిపై బయటకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన మేరకు.. అడ్డగుట్టలోని శాస్త్రినగర్‌కు చెందిన సాయికిరణ్(22) ఈ నెల 11న ఉదయం 6 గంటల సమయంలో పనిపై బయటకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి మళ్లీ తిరిగిరాలేదు. దీంతో అతని కుటుంబసభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తెలిసిన వారిని, బంధువులను, స్నేహితులను వాకబు చేసినా సాయికిరణ్ ఆచూకీ లభించకపోవడంతో అతడి తల్లి ఒద్దమ్మ బుధవారం తుకారాంగేట్‌లో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం


నర్సింగ్‌యాదవ్

చిలకలగూడ : చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మానసిక సమస్యతో బాధపడుతున్న ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్ఐ జ్ఞానేశ్వర్ తెలిపిన మేరకు.. మెట్టుగూడకు చెందిన నర్సింగ్ యాదవ్ (42) గతంలో మద్యానికి బానిసయ్యాడు. రెండేళ్ల క్రితం రిహాబిలిటేషన్ సెంటర్‌లో చేరి చికిత్స తీసుకుని మద్యం మత్తు నుంచి బయటపడి సాధారణ జీవనం గడుపుతున్నాడు. మూడు నెలలుగా మానసిక రుగ్మతలతో బాధపడుతున్నాడు. ఈనెల 9న సాయంత్రం 4 గంటలకు బయటకు వెళ్లిన నర్సింగ్ యాదవ్ తిరిగి ఇంటికి చేరలేదు. సన్నిహితులు, బంధుమిత్రులను వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో తండ్రి యాదగిరి యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విషాదఛాయలు

తార్నాకకు చేరిన బ్యాంక్ ఆఫ్ బరోడా ఉద్యోగి ప్రసాద్ మృతదేహం


ప్రసాద్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

లాలాపేట: కుంభమేళాకు వెళ్లి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడా ఉద్యోగి టీవీ ప్రసాద్(55) మృతదేహాన్ని బుధవారం ఆయన నివాసానికి తీసుకువచ్చారు. దీంతో తార్నాక హనుమాన్ నగర్‌లోని ఉమా సిగ్నేచర్ అపార్టుమెంట్‌లో విషాదఛాయలు నెలకొన్నాయి. ప్రసాద్ మృతదేహాన్ని చూసిన భార్య, కుమారుడు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరైనారు. తోటి ఉద్యోగులు వచ్చి ప్రసాద్ మృతదేహం వద్ద నివాళులర్పించారు.

'అంతర్గత'ం అధ్వానం

బౌద్ధనగర్ డివిజన్ వారాసీగూడ పోచమ్మ టెంపుల్ లైన్‌లో రెండు సంవత్సరాల క్రితం అంతర్గత రహదారి నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రారంభించారు. రూ.43 లక్షల వ్యయంతో ప్రారంభించిన నిర్మాణం పనుల్లో భాగంగా ఎడాపెడా తవ్వేశారు. ఆ తరువాత నిర్మాణం పనులు ప్రారంభం కాలేదు. ఇక్కడి ప్రజలు స్థానిక కార్పొరేటర్ మొదలు.. జీహెచ్‌ఎంసీ మేయర్ వరకు రహదారి నిర్మించి తమ ఇబ్బందులు తొలగించాలంటూ ఫిర్యాదు చేశారు. జనవరి 2వ వారంలో రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని స్వయానా ఇక్కడ పర్యటనకు వచ్చిన మేయర్ ఆదేశించినా నేటికీ నిర్మాణం పనులు ప్రారంభం కాలేదు. ఇది ఒక్క ఉదాహరణ మాత్రమే! సికింద్రాబాద్ నియోజకవర్గంలో అంతర్గత రహదారుల నిర్మాణం తీరు దినదినం అధ్వాన్నంగా మారుతోంది. సాంకేతిక కారణాలను సాకుగా చూపుతున్న జీహెచ్‌ఎంసీ అధికారులు ఇంటర్నల్ రోడ్ల నిర్మాణం పనులను అర్ధాంతరంగా నిలిపివేస్తున్నారు. దీంతో కాలనీలు, బస్తీల ప్రజలు ఇబ్బందులపాలవుతున్నారు.

– సికింద్రాబాద్

మేయర్ ఆదేశించినా ప్రారంభంకాని రోడ్డు పనులు

- ముందుకు సాగని రహదారుల నిర్మాణం
- ప్రతిపాదనలకే రూ.10 కోట్ల పనులు
- అర్థంతరంగా ఆగిపోవడంతో ఇబ్బందులు
- లష్కర్‌లో ఇంటర్నల్ రోడ్ల పరిస్థితి


వారాసీగూడ పోచమ్మ దేవాలయం లైన్‌లో కొత్త నిర్మాణానికి రెండేళ్ల క్రితం తవ్వేసిన రోడ్డు

నియోజకవర్గంలోని అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ ఐదు డివిజన్ల పరిధిలో రూ.10 కోట్లతో సిద్ధం చేసిన అంతర్గత రహదారుల నిర్మాణం పనులు ఎక్కడికక్కడ పడకేశాయి. కొన్ని చోట్ల టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్మాణం సమయంలో చేతులు ఎత్తేస్తుండడంతో రహదారుల నిర్మాణం పనులు నెలల తరబడి ప్రారంభమే కావడం లేదు.

- కొన్ని చోట్ల జలమండలి అధికారులు వ్యవహరిస్తున్న తీరు కూడా తమకు తలనొప్పి వ్యవహారంగా మారుతోందని జీహెచ్‌ఎంసీ అధికారులు పేర్కొంటున్నారు. పైప్‌లైన్ల నిర్మాణం పేరుతో అభ్యంతరాలు వంటి అనేక కారణాల ఫలితంగా రహదారుల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

పలు చోట్ల ప్రమాదకరం.

కొన్ని ప్రాంతాల్లో పాత రోడ్లను జీహెచ్‌ఎంసీ అధికారులు ఎడాపెడా తవ్వేస్తున్నారు. ఆ తరువాతమే ల్కొంటున్న జలమండలి అధికారులు అక్కడి భూగర్భం నుంచి వాటర్ లైన్లు వేయాల్సి ఉందని, వాటర్‌లైన్ల నిర్మాణం పూర్తయ్యాక రోడ్డు నిర్మించాలని చెబుతున్నారు. ఇటువంటి సాంకేతిక కారణాలతో ఐదు డివిజన్లలోని 20 రోడ్ల నిర్మాణం పనులను జీహెచ్‌ఎంసీ అధికారులు మధ్యలోనే నిలిపివేశారు.

- తార్నాక డివిజన్ ఆర్యనగర్ ఇంటర్నల్ రోడ్డు నిర్మాణం పనుల కోసం టెండర్లు ఖరారు చేసిన అధికారులు నిర్మాణం పనులు ప్రారంభించాలని ఏడాది క్రితం కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. తీరా పనులు ప్రారంభించాల్సిన సమయంలో టెండర్ పొందిన కాంట్రాక్టర్ చేతులు ఎత్తేయడంతో నిర్మాణం పనులు ఏడాది కాలంగా ప్రారంభం కాలేదు.
- కాంట్రాక్టర్లు, జలమండలి తదితర సాంకేతిక కారణాలు సాకుగా చూపుతున్న జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్ల నిర్మాణాలు ముందుకు సాగించడం కోసం ఎటువంటి ప్రత్యేక చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు స్థానికుల నుంచి వ్యక్తం అవుతున్నాయి. ఇటువంటి పరిస్థితులతో రోడ్ల నిర్మాణం పనులు నెలల తరబడి ఆగిపోతుండడంతో... స్థానికుల ప్రయాణాలు ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి.

ప్రతిపాదనల్లోనే...

సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో రహదారుల నిర్మాణం కోసం ప్రతిపాదించిన 50 అంతర్గత రోడ్ల నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదు. ఇందుకోసం రూ.10 కోట్ల నిధులను జీహెచ్‌ఎంసీ కేటాయించినప్పటికీ బిల్లులు ఇవ్వడం లేదన్న విమర్శలు కాంట్రాక్టర్ల నుంచి వ్యక్తం అవుతున్నాయి. ముందుకు సాగని అంతర్గత రహదారుల నిర్మాణాల్లో జలమండలి అధికారుల అభ్యంతరాలతో నిలిచిపోయిన పనులు 14 వరకు ఉండడం గమనార్హం.

జాబ్‌మేళాకు విశేష స్పందన



సనత్‌నగర్: రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, దిశా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సనతనగర్ సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలో నిర్వహించిన ఉద్యోగ మేళాకు విశేష స్పందన లభించింది. టెక్ మహీంద్రా, మెడ్‌ప్లస్, ఎంపవర్‌మెంట్ సర్వీస్, అపోలో తదితర కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూలు చేశారు. మొత్తం 188 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా 55 మంది ఉద్యోగాలకు సెలక్ట్ చేశారు. 25 మందికి అప్పటికప్పుడే ఉద్యోగ ఆఫర్ లెటర్స్ అందజేశారు. దిశా డైరెక్టర్ ఫాదర్ జస్టీన్, బీఎస్‌కే డైరెక్టర్ ఫాదర్ శరత్, దిశ కో–ఆర్డినేటర్ ఐవన్ వాజ్, కార్తీక్ తదితరులు ఉద్యోగ మేళా ఏర్పాట్లు చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

లాలాపేట: రాష్ట్రంలో వివిధ యూనివర్సిటీల్లో పని చేస్తున్న నాన్ టీచింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పలువురు ఉద్యోగులు బుధవారం తార్నాకలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కలిసి విన్నవించారు. ఎన్నో ఏళ్లుగా చాలీ చాలనీ వేతనాలతో సేవలందిస్తున్నామని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రం విశ్వవిద్యాలయాల నాన్‌టీచింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ సూర్యచందర్, అధ్యక్షుడు కట్టా వెంకటేష్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రాంగోపాల్‌పేట్: విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ, అంకితబావం, పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పలువురు వక్తలు సూచించారు. బుధవారం సికింద్రాబాద్‌లోని మహబూబ్ కళాశాల ఆవరణలో మహబూబ్ కళాశాల 1951,1967 పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో వార్షిక అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం కన్వీనర్, అధ్యక్షులు సీపీఎస్ ప్రకాశ్, కో కన్వీనర్ లక్ష్మీనారాయణ, కోశాధికారి విద్యాసాగర్, మహేష్ కుమార్ తదితర పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల వైభవాన్ని నిలబెట్టేలా విద్యార్థులు కష్టపడి చదుకుని మంచి పేరు సంపాదించాలన్నారు. ఈ సందర్భంగా 6 నుంచి 10వ తరగతికి చెందిన పేద, మెరిట్ విద్యార్థులకు ఫీజులో కొంత రీఎంబర్స్‌మెంట్, 10 వతరగతి టాపర్స్‌కు, తెలుగులో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు.

సమస్యలను వెంటనే పరిష్కరిస్తా


కళాసీగూడలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని

రాంగోపాల్‌పేట్: కళాసీగూడలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం ఆయన బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి, జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి కళాసీగూడ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగడం లేదని, కలుషిత జలాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని రోడ్లన్నీ మురుగు నీళ్లు పొంగి పొర్లుతున్నాయని చెప్పారు. వెంటనే తలసాని స్పందించి మంచినీటి పైప్‌లైన్ ఎక్కడ లీకేజీ అవుతుందో గుర్తించి కలుషిత జలాల సమస్యను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ సమ్మయ్య, జలమండలి డీజీఎం శశాంక్, ఈఈ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

క్రీడాకారులకు సత్కారం

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట ద వెటరన్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ క్రీడాకారులు ఫస్ట్ ఇండియన్ నేషనల్ మాస్టర్ ప్లేయర్స్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో పాల్గొని సత్తా చాటారు. జనవరి 20 నుంచి 25 వరకు ముంబయి అంథేరీలో జరిగిన ఈ క్రీడా పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచి ట్రోఫీలను అందుకున్నారు. ఈ సందర్భంగా లాలాపేటలోని ప్రొ.జయశంకర్ స్టేడియంలో వారికి అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డిలు పాల్గొని విజయం సాధించి వచ్చిన పలువురు వెటరన్ క్రీడాకారులను డిప్యూటీ మేయర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ విఠల్ బేతి, ప్రసిడెంట్ దయాకర్ కుసుమ, ఆర్గనైజింగ్ సెక్రటరీ నవీన్‌కుమార్ తదితరులున్నారు.


విజేతలను సన్మానిస్తున్న డిప్యూటీ మేయర్

విధి నిర్వహణలో అంకితభావంతో ఉండండి

బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి


పదోన్నతి పొందిన హెడ్‌కానిస్టేబుళ్లను అభినందించిన బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి

సనత్‌నగర్: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేయడం ద్వారానే ప్రజల మన్ననలను పొందగలుతామని బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి అన్నారు. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న శంకర్‌రావు, ఏసుబాబు, లచ్చయ్య, బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ అనిల్‌ ఏఎస్‌ఐలు పదోన్నతి పొందారు. ఈ మేరకు నలుగురూ బుధవారం బేగంపేట ఏసీపీని మర్యాదపూర్వకంగా కలవగా ఆయన వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మనం ఏ స్థాయిలో ఉన్నా క్రమశిక్షణతో నడుచుకోవడం ముఖ్యమన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్య

లోతుకుంట రైల్వే వంతెన వద్ద రాళ్లతో దాడి

సికింద్రాబాద్: ఒక వ్యక్తిని రాళ్లతో కొట్టి చంపిన దారుణ ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగుచూసింది. లోతుకుంట రైల్వే వంతెన కింద జరిగిన ఘటనలో మృతుడి వివరాలు పోలీసులకు లభించలేదు. జీఆర్‌పీ సికింద్రాబాద్ ఇన్‌స్పెక్టర్ సాయీశ్వర్‌గౌడ్ తెలిపిన మేరకు.. లోతుకుంట వంతెన కింద మృతదేహం పడి ఉన్నట్టు గుర్తించిన రైల్వే కీమెన్ జీఆర్‌పీ పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనాస్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహం పడిఉన్న తీరునుబట్టి హత్యకు గురైనట్టు నిర్ధారించారు. ఘర్షణలో చోటుచేసుకున్న రాళ్ల దాడితో సుమారు 50 ఏళ్ల వయసున్న వ్యక్తి తలపై తీవ్రగాయాలు కావడంతో మృతిచెందినట్టు పోలీసులు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురైనట్టు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి చేతిపై ఆంజనేయస్వామి పచ్చబొట్టు, మెడలో ఆంజనేయస్వామి లాకెట్ కలిగిన మాల ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలకు నిధులు విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని 144 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో వసతుల కల్పనకు నిధులు విడుదల చేయాలని తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం (టీడీఎల్‌ఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షులు డా.సీహెచ్ కిశోర్‌కుమార్ బుధవారం ప్రభుత్వాన్ని కోరారు. కొత్త కోర్సుల వలన విద్యర్థుల సంఖ్య పెరిగి తరగతి గదులు సరిపోవడం లేదన్నారు. నూతన గదుల నిర్మాణానికి, కంప్యూటర్ ల్యాబులు, సైన్స్ ల్యాబులు, లైబ్రరీల నిర్మాణానికి, నిధులు విడుదల చేయాలన్నారు.

విద్యకు తగినన్ని నిధులు కేటాయించాలి


సమావేశంలో పాల్గొన్న తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య సభ్యులు

అడ్డగుట్ట: డివిజన్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీహాలులో బుధవారం తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య (టీఏఎస్‌ఎస్) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... ప్రభుత్వాలు విద్యకు తగినన్ని నిధులు కేటాయించకపోవడం వలన రాష్ట్రంలో విద్యా వ్యవస్థ కుంటు పడుతోందన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య లభించాలంటే విద్యకు సరిపడ నిధులు కేటాయించాలన్నారు. సమావేశంలో సభ్యులు ప్రవల్లిక, మైథిలి, అనూష, మంజుల పాల్గొన్నారు.

మీ సేవా కేంద్రాన్ని పరిశీలించిన కార్పొరేటర్

సికింద్రాబాద్: రేషన్‌కార్డు పొందడం కోసం ఇదివరకే దరఖాస్తు చేసుకున్నవారు తిరిగి మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ చెప్పారు. బుధవారం కార్పొరేటర్ సీతాఫల్‌మండిలోని మీ సేవా కేంద్రాన్ని సందర్శించారు. దరఖాస్తులు స్వీకరిస్తున్న తీరును మీ సేవా కేంద్రం ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు


అమ్మవారిని ముస్తాబు చేసిన దృశ్యం

రాంగోపాల్‌పేట్: మోండా కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారి దేవాలయంలో బుధవారం మాఘ మాసం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరీదేవి లలితా పారాయణ సత్సంగ్ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి 152 చీరలు సమర్పించి అమ్మవారిని ముస్తాబు చేశారు. ఈ పూజల్లో భాగంగా అధిక సంఖ్యలో మహిళా భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్ఎస్ కుమారి, వీరలక్ష్మి, ప్రభావతి, లలితా పారాయణ సత్సంగ్ కమిటీ అధ్యక్షురాలు విజయలక్ష్మి, కార్యదర్శి రుక్మిణి, కోశాధికారి అరుణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి


కార్యక్రమంలో పాల్గొన్న డీసీపీ రష్మీ పెరుమాళ్

రాంగోపాల్‌పేట్: సైబర్ నేరాలపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాళ్ సూచించారు. బుధవారం సికింద్రాబాద్‌లోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో విద్యార్థినులకు గోపాలపురం పోలీసులతో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని, ఇటీవల సైబర్ అరెస్టుల పేరుతో మోసాలు చేస్తున్నారని తెలిపారు. విద్యార్థినులు అపరిచిత వ్యక్తులతో సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి వ్యక్తిగత విషయాలు, ఫొటోలు పంచుకోరాదన్నారు. కొందరు నేరప్రవృత్తి ఉన్న వాళ్లు వీటిని దుర్వినియోగ పరిచే అవకాశాలున్నాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన సందేహాలను ఆమె నివృత్తి చేశారు. కార్యక్రమంలో గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య, ఇన్‌స్పెక్టర్ నరేష్, పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి


పవన్ కుమార్‌ను సన్మానిస్తున్న ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నేతలు

కంటోన్మెంట్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సికింద్రాబాద్ రీజియన్ గౌరవ అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం సాయంత్రం జూబ్లీ బస్‌స్టేషన్ ప్రాంగణంలో ఆర్టీసీ బీసీ సంక్షేమ సంఘం సికింద్రాబాద్ రీజియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ గౌడ్‌ను సంఘం గౌరవాధ్యక్షులుగా, కుషాయిగూడ డిపోకు చెందిన కండక్టర్ సృజనను అధ్యక్షులుగా, కృష్ణను కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి, ఐక్యత సాధించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ. నిరంజన్, రాష్ట్ర అధ్యక్షులు తిరుపతయ్యల సమక్షంలో సమావేశంలో సంఘం నేతలు బాలరాజ్, శ్రీనివాస్, రాంబాబులతో పాటు వివిధ డిపోలకు చెందిన ఆర్టీసీ బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పవర్‌బోర్‌వెల్‌ను పునరుద్ధరించండి

సికింద్రాబాద్: బౌద్ధనగర్ డివిజన్ ఏకశిల మెడికల్ హాలు సమీపంలో ఉన్న పవర్‌బోర్‌వెల్‌ను వినియోగంలోకి తేవాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం విద్యుత్‌శాఖ ఏఈ రుచితను కలిసిన బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏకశిల ప్రాంత వాసులు నీటి ఎద్దడితో ఇబ్బందుల పాలవుతున్నారని చెప్పారు. ఇక్కడ పవర్‌బోర్‌వెల్ ఉన్నప్పటికీ విద్యుత్ బాక్సు, మీటర్ చేడిపోయిన కారణంగా పవర్‌బోర్‌వెల్ పనిచేయడం లేదని తెలిపారు. బీజేపీ నాయకులు మేకల కీర్తిహర్షకిరణ్, ఎస్ హన్మంతు, బండెల సత్యనారాయణ, మూల అరవింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బరిలో ఓయూ జేఏసీ నేత

ఉస్మానియా యూనివర్సిటీ: ఎమ్మెల్సీ బరిలో ఓయూ జేఏసీ వ్యవస్థాక సభ్యుడు, ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ చైర్మన్ రాథోడ్ రవీంద్ర నాయక్ పోటీ చేస్తున్నట్లు బుధవారం తెలిపారు. మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టపద్రుల నియోజక వర్గం నుంచి పోటీ చేస్తున్న తనకు ఓయూ విద్యార్థులు, తెలంగాణ ఉద్యమకారులు, ఉద్యోగులు, నిరుద్యోగులు మద్దతు ఇవ్వాలని కోరారు. జీవో నంబర్లు 46, 26 రద్దు కోసం పోరాడనున్నట్లు తెలిపారు.

సీసీ నగర్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం



బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూ నగర్ కమ్యూనిటీహాల్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. రెయిన్‌బో ఫౌండేషన్ ఇండియా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రెయిన్ బో కమ్యూనిటీ కేర్ అండ్ లెర్నింగ్ సెంటర్, జనహిత సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో హబ్సిగూడ ఆనంద్ ఐ ఇన్‌స్టిట్యూషన్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున స్థానిక ప్రజలు ఈ శిబిరానికి తరలి వచ్చి తమ కండ్లను పరీక్షించుకున్నారు. శిబిరంలో 30 మందికి కాటరాక్ట్ ఆపరేషన్ల కోసం సిఫార్సు చేశారు. ముఖ్య అతిథిగా కార్పొరేటర్ కె. హేమలత హాజరయ్యారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ కృష్ణవేణికి అభినందనలు


కృష్ణవేణిని అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం యూనిట్–4 వాలంటీర్ కృష్ణవేణి ఆంధ్రప్రదేశ్ నర్సాపూర్‌లో జరిగిన క్యాంప్ విజయవంతంగా పూర్తి చేసింది. భారత ప్రభుత్వం యూత్ ఎఫైర్స్ రీజనల్ డైరెక్టర్ ఎం.రామకృష్ణ పర్యవేక్షణలో నర్సాపూర్‌లో ఈ నెల 3 నుంచి 9 వరకు నిర్వహించిన ఎన్‌ఐసీ క్యాంప్‌లో ఉస్మానియా యూనివర్సిటీ తరుపున ఎంపికైన ముగ్గురు విద్యార్థినుల్లో కృష్ణవేణి ఒకరు. ఈ క్యాంప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కృష్ణవేణిని కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, ఇతర అధ్యాపక బృందం అభినందించారు.